

# పిపిపి విధానం దుర్మార్గం

- తక్షణమే ఉపసంహరించుకోవాలి
- రౌండ్ టేబుల్‌లో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దుర్మార్గమని, తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం కర్నూల్ నగరంలోని ఎస్టీయు భవన్‌లో ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర కార్యదర్శి ఎలెక్ట్ దేవన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను గుంపగుత్తగా ప్రైవేటు యాజమాన్యాలకు అప్పజెప్పేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో పేద విద్యార్థులకు మెడికల్ విద్య అందడం కష్టతరమవుతుందన్నారు. ప్రైవేటు సంస్థలకు అప్పగించడం ద్వారా వైద్య విద్య అందే అవకాశం ఉండదన్నారు. జీవో నెంబర్ 107, 108లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పిపిపి విధానం ఎంతో ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని అమలు చేస్తే వైద్యరంగం నిర్వీర్యం అవుతుందన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి నాయకులు నారాయణరెడ్డి, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు లాజరస్, బీసీ సంఘం నాయకులు శేషపని, రాయలసీమ విద్యావంతుల సంఘం నాయకులు రవికుమార్, సాగునీటి సాధన సమితి నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఐలారం, రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

# అధిక వర్షాలతో పత్తి రైతు విలవిల

- ప్రస్తుత వర్షాలతో కుళ్లిపోతున్న కాయలు
- పత్తి చేతికొచ్చినా తీసుకోలేని పరిస్థితి

**ప్రజాశక్తి- దేవనకొండ**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి రైతు విలవిలలాడిపోతున్నాడు. చేతికి వచ్చిన పత్తిని వర్షాల కారణంగా చెట్ల నుండి తీసుకునే అవకాశం లేక రైతులు నిస్సహాయంగా ఉండిపోతున్న పరిస్థితి ఏర్పడింది. గత మూడేళ్లుగా వరుసగా అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది వ్యవసాయ ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన పత్తి పంట ఏపుగా పెరగడంతో ఎంతో సంతోషించారు. పంట చేతికి వచ్చిన సమయానికి గత రెండు నెలల నుండి కురుస్తున్న అధిక వర్షాలతో పత్తి రైతు చిత్తవుతున్నాడు. పండించిన పంటను కూడా తెచ్చు కోలేని పరిస్థితి నెలకొంది. పత్తి తీత సమయానికి ప్రతిరోజు వర్షం కురుస్తుండడంతో చెట్టుపైనే కాయలు కుళ్ళి, పత్తి కారి తీవ్రంగా నష్టపోతున్నాడు. దేవనకొండ మండలంలో 32 వేల ఎకరాలలో రైతులు పత్తి పంటను సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకు విత్తనాలు, నాటు, కలుపులు, దున్నకాలు, క్రిమిసంహారక, రసాయన మందులు మొత్తం కలిపి రూ.40 వేలు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధిక వర్షాలకు పత్తి పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను చూపిస్తున్న రైతు

**అధిక వర్షాలతో నష్టపోయా**



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి పంట దెబ్బతిని నష్టపోయాను. నాకున్న 3ఎకరాల పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాను. పత్తి తీత తీసే సమయానికి వర్షాలతో పత్తి కాయలు నల్లగా మారి కుళ్ళిపోయాయి. పత్తి కారిపోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు.

- రైతు ఉప్పర హనుమంతు.

**పత్తి రైతులను ఆదుకోవాలి**



వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పత్తి పంట వర్షాలకు దెబ్బ తినడంతో మార్కెట్లో కూడా సరైన గిట్టుబాటు ధర రైతుకు లభించడం లేదు. క్వింటా పత్తి రూ.8 వేలు ఉండగా వర్షాలకు దెబ్బతినిందని చెబుతూ రూ. 5 వేల నుండి నుండి రూ. 7 వేల లోపు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకుని, ఎకరాకు రూ. 20000 నష్టపరిహారం అందించాలి.

- వీరశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

- సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి
- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి
- కెకె భవన్‌లో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా 5వ మహాసభ

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఆశా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కెకె భవన్‌లో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ కర్నూలు జిల్లా 5వ మహాసభ ఈశ్వరీ బాయ్, రమిజాబి, వెంకటమ్మల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు చట్టబద్ధకమైన సౌకర్యాలు కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నా వారిని కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. ఆశా వర్కర్లతో చేయిస్తున్న పనికి ప్రభుత్వం ఇస్తున్న వేతనాలకు పొంతన లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1200 మందికి ఒక ఆశా వర్కర్ ఉండాల్సి ఉండగా 1500 నుంచి 3000 ఒక ఆశా వర్కర్ పని చేయాల్సి వస్తుందన్నారు. ఎన్‌హెచ్ఎం నిబంధనల ప్రకారం ఆశా వర్కర్లు నియమించి, వారిపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. ఆశా వర్కర్లతో ఇతర పనులు చేయించడం, వ్యాక్సిన్ బాక్సులు మోయించడం సరైన పద్ధతి కాదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పిఎస్.రాధాక్రిష్ణ, ఎండి.అంజిబాబు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తయిన ఆశ వర్కర్లకు ఉద్యోగ నియామకాల్లో వేయిటేజీ ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం నివారించాలన్నారు. వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కోసం ఆశా వర్కర్లు రాబోయే కాలంలో ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ ఆశా వర్కర్లు వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని గంటలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పి.రమిజా బి, ప్రధాన కార్యదర్శిగా శివలక్ష్మితో పాటు 33 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆశాలు పాల్గొన్నారు.




మహాసభలో మాట్లాడుతున్న ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

# పారిశ్రామికవాడ పైపులైన్ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ముచ్చుమర్రి నుండి ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటి సరఫరాకు చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్ మండలం గుట్టపాడు గ్రామ సమీపంలో ఉన్న జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్లాంట్ వివరాలను యాజమాన్యం, అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఎంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించారని కలెక్టర్ యాజమాన్యంను ఆరా తీశారు. సిఎస్సార్ నిధుల కింద నంద్యాల చెక్ పోస్ట్ వద్ద నిర్మిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ఉద్యానవనం పార్కును అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళాలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం స్టీల్ ఉత్పత్తిని కలెక్టర్ పరిశీలించారు. ఆ తర్వాత ఉప్పలపాడు వద్ద డ్రోన్ హబ్‌కు కేటాయించిన 300 ఎకరాల ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. కర్నూలు ఆర్డీఓ సందీప్, ఏపిఐఐసి జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్, జయరాజ్ ఇస్పాత్ యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**గ్రీన్‌కో ప్రాజెక్ట్‌లో కలెక్టర్ పర్యటన** : ఓర్వకల్లు మండలం గుమ్మితం తండా వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పర్యటించారు. గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ సైట్‌లోని అప్పర్ రిజర్వాయర్, అప్పర్ ఇన్ టేక్ పాయింట్, ప్రాజెక్ట్ సైట్,పవర్ హౌస్ తదితర ప్రాంతాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్ట్ పనితీరు, రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి, పంపింగ్ ప్రక్రియల గురించి జిల్లా కలెక్టర్ కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. 1680 మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే మొట్టమొదటి అతిపెద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ అని, 4000 మెగావాట్ల సౌర, 1000 మెగావాట్ల పవన సామర్థ్యంతో కలిపి మొత్తం 6680 మెగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని కలిగి ఉందని గ్రీన్ కో అధికారులు కలెక్టర్‌కి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యత, భద్రతా ప్రమాణాలకు కట్టుబడి ఉండటంతో పాటు పనులు సకాలంలో పూర్తయ్యేలా చూసుకోవాలని గ్రీన్ కో యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పిడి శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

# ఆర్‌పిలపై వేధింపులు ఆపాలి

- లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు
- ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

మెప్మా ఆర్‌పిలపై అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఎపి మెప్మా ఆర్పీల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం కల్లూరు అర్బన్ సూర్యనారాయణ భవన్‌లో ఏపీ మెప్మా ఆర్పీల ఉద్యోగుల సంఘం జిల్లా 2వ మహాసభ నాయకురాలు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ధనలక్ష్మి మాట్లాడుతూ మెప్మా ఆర్పిగా ఎంపిక చేయబడిన నాటి నుండి ఎస్ఎల్ఎఫ్ ఎంప్లాయిస్‌గానే ఉన్నట్లు గుర్తుంచుకోవాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా, మంత్రి, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, గల్లీ నాయకులు గానీ పాయింట్మెంట్ ఇచ్చిన వారు కాదన్నారు. పొదుపు గ్రూపులకు, సభ్యులకు అవసరమైన బ్యాంకు లింకేజీ, పొదుపు అప్పుల రికవరీ, బ్యాంకు లింకేజీ రికవరీ, సమయం ఉంటే ఎప్పుడో ఒకసారి మంత్రుల ప్రోగ్రామ్‌కు, ఒకటి రెండు సార్లు హాజరవుతారు తప్ప గల్లి నాయకుల నుండి ఎమ్మెల్యే, మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆర్‌పిలు వెట్టి చాకిరి చేసే వారు కాదన్నారు. ఎండి గత ఏప్రిల్‌లో కార్పొరేషన్ సంబంధించిన పనులు ఆర్పిలకు సంబంధం లేదన్నారన్నారు. ఆర్పిలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని చట్టం చెబుతున్నా ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఒకవేళ వేతనం పెంచినా గ్రేడింగ్ విధానం రద్దు చేయకపోతే వచ్చే వేతనం చాలా తక్కువగా ఉంటుందన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కర్నూల్ నగరంలో మహిళా మార్ట్ పేరుతో 60 లక్షలకు పైగా వసూలు చేసిన మొత్తాన్ని ప్రతి సభ్యురాలుకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం 36 మందితో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యకురాలిగా పి.రుద్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉమాదేవి, కోశాధికారిగా సుజాత ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.పర్వీన్, శ్యామల, లక్ష్మీబాయి, నాగమణి, కార్యదర్శులుగా స్వాతి, సువర్ణ, సునీత, ఖైరూన్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అరుణ (ఓల్డ్ సిటీ), కన్యక, శ్రీ మంజుల బి.జ్యోతి, లలిత, వరలక్ష్మి, సాయి కృష్ణమ్మ, కృష్ణవేణి, మద్దమ్మ, వసుంధర, మనోరమ, విమల భాయ్, రాజేశ్వరి, కుమారి, జానకి, వీణా బాయి, ఇమాంబి, అనామికలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యదర్శులు ఎండి అంజిబాబు, ఏ.నాగరాజు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు మోహన్, వెంకటేశ్వర్లు, నగర నాయకులు సాయి బాబా, నరసింహులు, కర్నూలు , గూడూరు, ఎమ్మిగనూరు ఆర్‌పిలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్‌పి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటులు, మాల్ యాజమాన్యం

## పత్తికొండలో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

**ప్రజాశక్తి - పత్తికొండ**

అతి తక్కువ ధరలకే వస్త్ర దుస్తులు కాసం ఫ్యాషన్‌లో దొరుకుతాయని సినీ నటీనటులు 'కోర్టు' సినిమా ఫేమ్ శ్రీదేవి, రోషన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 20వ కాసం ఫ్యాషన్‌ను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. అధునాతన కలెక్షన్లతో నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరు గాంచిందని తెలిపారు. కాసం డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో ఐదేళ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ 20వ స్టోర్స్ ప్రారంభించామని తెలిపారు. మా వస్త్రాలను ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత సినీనటులను చూడడానికి ఉదయం నుంచి అభిమానులు, పరిసర ప్రాంత యువత బారులు తీరారు. యువత కేరింతలతో షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. కాసం ఫణి, కాసం సాయి కృష్ణ, యాంసాని ప్రవీణ్, పుల్లూరు అరుణ్ కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్ పాల్గొన్నారు.

## పర్యవేక్షణ పక్కగా నిర్వహించాలి : జెసి

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

జిల్లాలో ఉన్న 11 చిన్న పిల్లల సంరక్షణ సంస్థల పర్యవేక్షణ పక్కాగా నిర్వహించాలని జెసి, కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మిషన్ వాత్సల్య స్కీంలో భాగంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బాలల పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సంరక్షణ సంస్థలు బాలలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఐసిడిఎస్ పీడీ విజయ పాల్గొన్నారు

## మేయర్ వార్డులో రోడ్లు అధ్వానం

- పట్టించుకునే దిక్కేలేరు - పిపిఎస్ఎస్ నాయకులు

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

మేయర్ రామయ్య వార్డులో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, పట్టించుకునే వారే లేరని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు విమర్శించారు. మంగళవారం సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి, మహ్మద్ యూనూస్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ ప్రతినిధులు రాముడు, పార్వతమ్మ, వాసు మాట్లాడారు. 19వ వార్డులో మీదుగా నందికొట్కూరు రోడ్డు వెళ్లే ప్రధాన రోడ్డు శిథిలమై ప్రజలు నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఉందని తెలిపారు. రోడ్లపై బురద నీళ్లలో ప్రమాదవశాత్తు కింద పడి కాలు విరిగి ఇంటికే పరిమితమైన వీరన్న పరిస్థితిని నాయకుల దృష్టికి తెచ్చారు. నాలుగేళ్లు గడుస్తున్నా నగర మేయర్ వార్డులో రోడ్డు వేయించేందుకు కృషి చేయకపోవడం బాధాకరమని నాయకులు తెలిపారు. వెంటనే సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు.

# డప్పులతో దద్దరిల్లిన కలెక్టరేట్

- కలెక్టరేట్ ఎదుట డప్పు కళాకారుల ధర్నా
- డప్పు కళాకారులకు రూ.7 వేల పింఛను ఇవ్వాలి
- రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

తమ సమస్యలు పరిష్కరించాలని డప్పు కళాకారులు డప్పులు వాయించడంతో కలెక్టరేట్ దద్దరిల్లింది. మంగళవారం ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్ అధ్యక్షత వహించారు. ఎపిడికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తి చేసుకున్నా నేటికీ డప్పు కళాకారుల పింఛను ఆన్‌లైన్‌ను విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. పింఛను నమోదు వయస్సును 45 ఏళ్లకు తగ్గించాలన్నారు. తరతరాలుగా అంటరానితనాన్ని, అవమానాన్ని భరిస్తూ సమాజానికి ఉపయోగపడే సాంప్రదాయ కళ డప్పు కళ అని పేర్కొన్నారు. పింఛను రూ.7 వేలకు పెంచాలని కోరారు. మూడు సెంట్ల ఇంటి స్థలమిచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. డప్పు కళాకారునికి డప్పు, గజ్జలు, డ్రస్సు ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ నాయకులు విజయమ్మ, ఏసురాజు, ఆనంద్, దస్తగిరి, కౌతాళం మండల నాయకులు తాయప్ప, గోనెగండ్ల మండల అధ్యక్షులు మాణిక్యం, నందవరం మండల కార్యదర్శి చిన్నరాజు, మంత్రాలయం మండల కార్యదర్శి మారెప్ప, జిల్లా నాయకులు అంజి, సురేష్, కోసిగి మండల కార్యదర్శి హనుమంతు, పెద్ద హనుమంతు, కర్నూలు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏసన్న, వెంకటేశ్వర్లు, ఓర్వకల్లు మండల కార్యదర్శి రామకృష్ణ, క్రిష్ణగిరి మండల నాయకులు మాదన్న, కల్లూరు మండల కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు

## ముందస్తు జాగ్రత్తలతో చోరీలకు అడ్డుకట్ట : ఎస్పీ

**ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్**

దసరా సెలవుల నేపథ్యంలో సొంతూరు, ప్రాంతాలకు వెళ్లే వారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఇళ్లకు తాళమేసి సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు, విహార యాత్రలకు వెళ్లేవారు ఇళ్లల్లో విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు ఉంచి వెళ్లకూడదని తెలిపారు. బ్యాంకు లాకర్లలో, లాకర్లు లేని ప్రజలు వాటిని నమ్మకమున్న వారి ఇళ్లల్లో, బంధువుల ఇళ్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. సాధ్యమైనంతవరకు ఇళ్లకు సిసి కెమెరాలను అమర్చుకోవాలని చెప్పారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాలు దసరా పండగ సెలవులు ముగిసే వరకు రాత్రి సమయాల్లో గస్తీని ఏర్పాటు చేసుకుంటే మంచిదని, దొంగతనాలు అరికట్టవచ్చని తెలిపారు.

## ఫేక్ సర్టిఫికెట్లపై విచారణ చేయండి : డిఇఒ

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

ఫేక్ సర్టిఫికెట్ల పేరుతో ఉద్యోగ నియామకాలపై విచారణ చేపట్టాలని డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్ ఎస్పీని కోరారు. మంగళవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను డిఇఒ శామ్యూల్ పాల్ కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

**సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు**

దసరా సెలవుల్లో ప్రయివేట్ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని డిఇఒ శామ్యూల్ పాల్ హెచ్చరించారు. ఎక్కడైనా ప్రయివేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహించినట్లు తమ కార్యాలయానికి ఫిర్యాదు అందితే సంబంధిత పాఠశాలపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

విద్యార్థులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం క్లస్టర్ యూనివర్సిటీలో వికసిత్ భారత్ సేవా పర్వ్ 2025 వర్క్ షాపు నిర్వహించారు. తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం.ఫామీద బేగం అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి, డీన్లు నాగరాజ్ శెట్టి వాహిజ్, డాక్టర్ ఎల్లా కృష్ణ, డాక్టర్ నాగ్ అరుణ్, డాక్టర్ డి.మల్లయ్య, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సవిత పాల్గొన్నారు.

# జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు

- విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా కర్నూలు మెడికల్ కళాశాలలో ఫార్మకాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

**మెరిసిన మైపర్ విద్యార్థులు**

5వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవంలో మైపర్ విద్యార్థులు మెరిశారు. మంగళవారం కర్నూలు మెడికల్ కళాశాల ఫార్మాకాలజీ విభాగం, మైపర్‌తో కలిసి క్విజ్, వ్యాసరచన, వాదోపవాదం, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి పోటీలను 'యువర్ సేఫ్టీ, జస్ట్ ఎ క్లిక్ అవే : రిపోర్ట్ టూ పివిపి' అనే అంశంపై నిర్వహించారు. మైపర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అనేక బహుమతులు సాధించారు. క్విజ్ పోటీల్లో కెజె.నవ్యనందిని మొదటి బహుమతి, ఐ.శశికళ మూడో బహుమతి, వ్యాసరచన పోటీల్లో ఎం.స్వాతి మొదటి బహుమతి, పోస్టర్ ప్రెజెంటేషన్‌లో ఎం.స్వాతి మొదటి బహుమతి, ఎస్.వైష్ణవి మూడో బహుమతి సాధించారు. విజేతలను అభినందిస్తూ మైపర్ యాజమాన్యం, అధ్యాపకులు వారి ప్రతిభపై ప్రశంసలు కురిపించారు.



ప్రతిభ చాటిన మైపర్ విద్యార్థులు

## ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సేవలు

- కమిషనర్ విశ్వనాథ్

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే మరింత మెరుగ్గా పని చేస్తారని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా అంగీకార్-2025 అవగాహన కార్యక్రమం కింద నగరపాలక కార్యాలయ ఆవరణలో మంగళవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... నగరంలో ఇల్లు లేనివారుంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మధ్యతరగతి వారు ఇళ్ల కోసం సబ్సిడీ రుణాలు పొందాలని కోరారు. వైద్య శిబిరంలో ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధిత పరీక్షలు, సాధారణ ఆరోగ్య సలహాలను వైద్యులు అందించారు. సుమారు 150 మందికి పైగా లబ్ధిదారులు, ఉద్యోగులు, ఇతరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డాక్టర్ పెంచలయ్య, ఎంఐఎస్ మధుసూదన్ రెడ్డి, మెడికవర్ ఆస్పత్రి వైద్యులు మురళీ మోహన్, మంజునాథ్, మహేశ్వర్ రెడ్డి, బివి.కొండారెడ్డి, శేషు నాయుడు పాల్గొన్నారు.

## నేడు మహిళలకు మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి - కోడుమూరు**

'స్వస్థ్ నారి, సశక్త పరివార్ అభియాన్'లో భాగంగా కోడుమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మహిళలకు మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ బి.నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. వైద్య శిబిరంలో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. కోడుమూరు పరిసర ప్రాంత ప్రజలు హాజరయ్యి రక్తదానం చేయాలని కోరారు.

## దేవదాయ భూములు స్వాహా..!

- అమ్మకోవడానికి సిద్ధమైన టిడిపి నాయకులు
- ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి - క్రిష్ణగిరి**

టిడిపి దేవదాయ శాఖ భూములను ఆక్రమించి, అమ్ముకోవడానికి సిద్ధమయ్యారని ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన కర్నూలు దేవదాయశాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని కోయిలకొండ గ్రామంలో 457 సర్వే నెంబర్‌లో 15.40 ఎకరాలు శ్రీఈశ్వర స్వామి మన్యం భూమి ఉందని తెలిపారు. ఇందులో 2002లో దేవదాయ శాఖ నుంచి రెవెన్యూ శాఖకు ఆరెకరాలు రూ.1.80 లక్షలకు విక్రయించి అందులో మోడల్ కాలనీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పుడు మిగిలిన 9.40 ఎకరాల్లోని రెండెకరాల్లో ప్లాట్లు వేసి విక్రయించాలని టిడిపి నాయకులు పన్నాగం పన్నారని విమర్శించారు. నకిలీ పత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయించి జేబులు నింపుకున్నారని, పరిరక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గూడెంపాడు శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపిపి వెంకటరామిరెడ్డి

## దెబ్బ తిన్న ఉల్లి గణన చేపట్టాలి

**- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**

**ప్రజాశక్తి - ఆదోనిరూరల్**

ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా దెబ్బ తిన్న ఉల్లి పంట గణన చేపట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని మండలం మదిరె గ్రామంలో ఉల్లి పంట రైతులు సాగు చేసిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గణనలో ఎలాంటి ఫిర్యాదులూ రాకుండా జాగ్రత్తగా చేపట్టాలని తెలిపారు. రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ఎకరాకూ కచ్చితమైన లెక్కలు నమోదు చేసి, పారదర్శకత పాటించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని మదిరె గ్రామంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి పట్టాల మంజూరుకు అనువైన స్థలాలను గుర్తించి, అర్హులైన ప్రతి కుటుంబానికీ పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఇంటి పట్టా మంజూరుకు కోసం స్థలాలను పరిశీలించారు. తహశీల్దార్ రమేష్, ఆర్ఐ లక్ష్మయ్య, వీఆర్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

## సాగు, తాగునీటికి కృషి

**- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి**

**ప్రజాశక్తి - ఆలూరు**

నియోజక వర్గంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. మంగళవారం ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టు 2014లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేశారని, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీలో గ్రూపు విభేదాలకు తావు లేకుండా అందరినీ ఏకతాటిపై తెచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సమస్యలుంటే పార్టీ కార్యకర్తలు తనను నేరుగా కలువచ్చని తెలిపారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివ ప్రసాద్ మాట్లాడుతూ... పార్టీలో వైసిపి కోవర్టులకు పనిచేసే వారికి స్థానం లేదన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడూ అందు బాటులో ఉండి జ్యోతి పని చేస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు, బిల్లేకల్ వెంకటేష్, విరుపాక్షప్ప, విజయ భాస్కర్, కురువ జయరాం, కృష్ణయాదవ్, మొలగవల్లి శీనప్ప, మనేకుర్తి రాజశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి దంపతులు

## 'ఉల్లిని పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ చేయాలి'

**ప్రజాశక్తి - కోసిగి**

మండలంలో పూర్తిస్థాయిలో ఉల్లి పంటను ఈ-క్రాప్ చేసి ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారాన్ని ప్రతి రైతుకూ అందించాలని రైతుసంఘం నాయకులు కోరారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు వీరేష్, పూజారి శ్రీనివాసులు, రాముడు మాట్లాడారు. ఉల్లి రైతులు పంటను ఈ-క్రాప్ చేయకపోవడంతో ప్రభుత్వం అందించే నష్టపరిహారానికి దూరమవుతున్నారని, ఖరీఫ్ సీజన్‌లో ఉల్లి పంట వేసి నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందించాలని కోరారు. మండలంలో దాదాపు 2 వేల ఎకరాలకు పైగా ఉల్లి పంట సాగు చేశారని తెలిపారు. 1600 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయని అన్నారు. అనంతరం ఎఒ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఉల్లి రైతులు శివప్ప, ప్రకాష్, హొళగుంద చిన్న కోసిగయ్య, ఆర్‌కంటి పెద్ద లక్ష్మన్న, ఎం.శ్రీనివాసులు, మహాదేవ్, నరసప్ప, వీరప్ప, పి.లక్ష్మన్న, నరసప్ప, లక్ష్మి, వీరేష్, బసవరాజు, లక్ష్మన్న, పెద్దముకప్ప, శరబంద్ పాల్గొన్నారు.

## శ్రీమఠానికి టేకు కలప విరాళం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రమైన శ్రీమఠానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.30 లక్షల విలువ చేసే టేకు కలపను విరాళంగా అందజేశారు. మంగళవారం టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, కోసిగి మండల ఇన్‌ఛార్జి భరద్వాజ్ శెట్టి, నాయకులతో కలిసి స్థానిక శ్రీమఠం చేరుకున్న ఆయన శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీఅన్నపూర్ణ భోజనశాలకు అప్పగించారు. శ్రీమఠంలో నిర్వహించే నిత్య ప్రసాద వితరణ తయారీకి ఈ కలప ఉపయోగ పడుతుందని టేకు కలపను విరాళంగా ఇచ్చినట్లు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, హండే అనుమంతు, గనేకంటి రఘు, విద్యా కమిటీ ఛైర్మన్ గనేకంటి గురురాజ, చిన్నభీమ, తిక్కస్వామి గౌడ్ పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న నాయకులు

# వివాదంలో శ్మశాన స్థలం...

**- చోద్యం చూస్తున్న పాలకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

**ఆదోనిలో శ్మశాన స్థలం వివాదంగా మారింది. తమదే అంటూ యాదవులు, దశాబ్ద కాలంగా తాము కూడా ఇక్కడే మృతదేహాలను ఖననం చేస్తున్నామని దళితులు పేర్కొంటున్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించాల్సిన పాలకులు చోద్యం చూస్తూ ఉండడంతో వివాదం ముదిరి రోడ్డున పడింది.**

పట్టణంలోని కొత్తబస్టాండ్ డిపోను ఆనుకొని శ్మశాన స్థలం ఉంది. ప్రస్తుతం ఆ స్థలానికి మంచి డిమాండ్ ఏర్పడింది. నిరుపయోగంగా ఉన్న ఆ స్థలం 'మాదే' అంటూ, అక్కడ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలర్పించిన తమ కులం వారిని పూడ్చిన సమాధులు ఉన్నాయని యాదవ సంఘం నాయకులు చెబుతున్నారు. అప్పట్లో దళితులకు, బుడగ జంగాలకు కూడా శ్మశానం కోసం స్థలం ఇచ్చారని, పూర్వం నుంచి ఇక్కడే ఖననం చేస్తున్నామని దళితులు పేర్కొంటున్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఇరువర్గాల మధ్య వివాదం ముదిరి ఘర్షణ వాతావరణం చోటు చేసుకునే ప్రమాదం ఉంది. కొత్తబస్టాండ్ ముందు రోడ్డులోని డిపోను ఆనుకొని ఉన్న మండగిరి 396 సర్వే నెంబర్‌లో 3.25 ఎకరాల శ్మశానం స్థలం ఉన్నట్లు మున్సిపాలిటీ రికార్డులు చెబుతున్నాయి. అక్కడ వాస్తవంగా 50 సెంట్ల స్థలం కూడా లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పూర్వం నుంచి తమ కులం వారికి రాసిచ్చిన స్థలం ఎక్కడంటూ ఫిర్యాదుదారులు యాదవ సంఘం నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆ స్థలం చుట్టూ ఇప్పటికే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రోడ్డు వైపు ఉన్న కాలువ పక్కన కొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. దుకాణాలు ఖాళీ చేసి సర్వే చేయించి హద్దులు చూపాలని ఇటీవల యాదవ సంఘం నాయకులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం జెసిబితో ప్లానింగ్ సెక్రటరీలు అక్కడికి చేరుకున్నారు. దుకాణాలు తొలగించడం తర్వాత.. దళితులకు సంబంధించిన శ్మశానం హద్దులు కూడా చూపించాలని మాజీ కౌన్సిలర్ నాగరాజు ఆ వార్డు నాయకులు మధు, విశ్వ, కౌన్సిలర్ చలపతి డిమాండ్ చేశారు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలకు, స్థానికంగా ఉండే ఇంద్రనగర్ వాసులకు వాగ్వాదం చోటుచేసుకుంది. దుకాణాలు తొలగించేందుకు అభ్యంతరం లేదని, ఎక్కడో ఉండి ఫిర్యాదు చేయడం సరికాదని, ఘటన స్థలానికి వచ్చి మాట్లాడి సరయిన ఒప్పందం చేసుకుంటేనే దుకాణాల తొలింగింపునకు ఒప్పుకుంటామని దళితులు భీష్మించారు. టూ టౌన్ ఎస్ఐ రామనాథ్, ఎఎస్ఐ నరసయ్య, పోలీసులు వారికి నచ్చ చెప్పారు. సమస్య తీవ్రతరం కాకుండా అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అధికారులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించడంతో ఆందోళన విరమించారు. కొంత గడువు కావాలని దళితులు కోరడంతో దుకాణాల తొలగింపును తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.



### అధికారుల ఒత్తిడి ఉంది

**- బాల మద్దయ్య, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఆదోని**



ఆక్రమణలు తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉంది. శ్మశానంలో కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఆటంకంగా ఉన్న దుకాణాలను తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌టిసి డిపో రోడ్డు పక్కన ఉన్న దుకాణాల తొలగింపు చేపట్టాం. మాకున్న సమాచారం 50 సెంట్ల శ్మశానం స్థలం ఉంది. దుకాణాలు తొలగించాలని గతంలోనే నోటీసులు జారీ చేశాం. దుకాణదారులు కూడా ఆగస్టులోనే ఖాళీ చేస్తామని చెప్పారు. ఖాళీ చేయించే వరకే మా పని. మిగతా వ్యవహారం అధికారులు చూసుకుంటారు. మూడు రోజులు గడువు అడిగారు. తర్వాత ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

## మహిళల ఆరోగ్యానికి కృషి : టిడిపి

**ప్రజాశక్తి - నందవరం**

మహిళలు ఆరోగ్యవంతమైన జీవితానికి కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్షులు ఖాసీం వలీ తెలిపారు. మంగళవారం మండలం లోని మాచాపురం గ్రామంలో వైద్యాధికారిణి శ్రీలేఖ ఆధ్వర్యంలో 'స్వస్త్ నారి- సశక్తి పరివార్' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఖాసీంవలీ హాజరయి మాట్లాడారు. మహిళలు ఆరోగ్యాన్ని సంరక్షిం చుకోవాలని సూచించారు. వారు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం సంతోషంగా ఉంటుందని తెలిపారు. అనంతరం వైద్యులు మహిళల కు అవగాహన కల్పించారు. గర్భిణులు నిత్యం వైద్యుల సలహాలు తీసుకుంటూ ఉండాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల ని, దోమల బారిన పడకుండా ఉండాలని సూచించా రు. టిడిపి గ్రామ అధ్యక్షులు రంజాన్, మాజీ అధ్యక్షులు వెంకట రాముడు, మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు, సత్యారెడ్డి పాల్గొన్నారు.

**బాలికలు క్రీడల్లో రాణించాలి :** బాలికలు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఖాసీంవలీ సూచించారు. అంతర్ జిల్లా-19 బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్ నందవరం జడ్‌పి స్కూల్‌లో ప్రారంభించా రు. ఖాసీంవలీ అతిథులుగా హాజరయ్యారు. భీమశేఖర్, సత్యారెడ్డి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

## పి4 సర్వే వేగవంతం : ఎంపిడిఒ

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పి4 సర్వేను, హౌసింగ్, ఎనర్జీస్ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ అల్లాబకాష్ ఆదేశించారు. మంగళవారం మండల కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏ సమాచారం అడిగినా వెంటనే బదులిచ్చేందుకు సిద్ధంగా ఉండాల న్నారు. పి4 సర్వేను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. నిలిచిన హౌసింగ్ నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల శాతం పెరగాలని, ప్రభుత్వ సర్వేలను సకాలం లో పూర్తి చేయాలని తెలిపారు. బాలన్న, జయరామ్ నాయక్, సిసింద్రీ, సురేంద్ర, ప్రమీల, హరిబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లాబకాష్

## కూటమిలో పదవుల గోల..!

**- మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సీటుపై ఉత్కంఠ**

**- ఎటూ తేల్చని అధిష్టానం**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక భారీ ఎత్తున నామినేటెడ్ పదవులు ప్రకటించారు. జిల్లాలో చాలా చోట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవులు భర్తీ చేశారు. మూడో విడతలో ఆదోని మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా జిందే శారదను, వైస్ ఛైర్మన్‌గా అదూరి విజయ్ కృష్ణను ప్రకటించారు. ఈనెల 15న కూటమి నాయకులు, ఎమ్మెల్యే పార్థసారథి సిఫారసు మేరకు ఛైర్మన్ జిందే శారద, వైస్ ఛైర్మన్ అదూరి విజయ్ కృష్ణకు నియామక ఆదేశాలు వెలువడ్డాయి. ఈ నియామకంపై వివాదం చెలరేగింది. వైస్ ఛైర్మన్‌గా అదూరి కృష్ణ అర్హుడు కాదని, ఆ స్థానంలో న్యాయవాది లోకేష్, సీనియర్ నాయకులు కడిమెట్ల రామకృష్ణను నియమించాలని ఎమ్మెల్యే పార్థసారథి ఈనెల 11న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కు స్వయంగా లేఖ అందించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈనెల 22న మార్కెట్ యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం జరగాల్సి ఉండగా, ప్రస్తుతం అది అక్టోబర్ 4కి వాయిదా పడింది. ఒకవైపు వైస్ ఛైర్మన్ పదవి దక్కించుకున్న అదూరి విజయ్ కృష్ణ వారం రోజులుగా ఆదోనిలో సంబరాలు జరుపుకుంటుంటే, మరోవైపు న్యాయవాది లోకేష్ బిజెపి జిల్లా అధ్యక్షుని నుంచి రాష్ట్ర అధ్యక్షుని వరకు పావులు కదు పుతూ ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ప్రకారం వైస్ ఛైర్మన్ పదవి తనకే రావాలని పట్టుబడు తున్నట్లు సమాచారం.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

**- మూడు రోజుల పాటు బాలబాలికలకు పోటీలు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 69వ రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ పి.ప్రభాకర్ రావు, బీవీ యూత్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ వాల్మీకి రామకృష్ణ నాయుడు పోటీలను ప్రారంభించారు. ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రాఘవేంద్ర ఆచారి అధ్యక్షత వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 520 మంది బాలబాలికలు పాల్గొన్నారు. బాలురకు ఎమ్మిగనూరులో, బాలికలకు నందవరం జడ్‌పి హైస్కూల్‌లో పోటీలు జరుపుతారు. ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఎంపికయిన వారు అక్టోబర్ 5న జమ్ము కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వారు మాట్లాడుతూ... పట్టణంలో రాష్ట్రస్థాయి పోటీలు జరగడం గర్వంగా ఉందని, ఎమ్మిగనూరులో క్రీడల పట్ల ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. బీవీ యూత్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కామర్తి మహేష్, ట్రెజరర్ షేక్ అబ్దుల్లా, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి దామ నరసింహులు, పిఇటిలు వి.నరసింహ రాజు, బి.శ్రీనివాసులు, హనీఫ్, సిజి.ఈరన్న, శ్రీరాములు, లతీఫ్, వెంకటేష్, బసవరాజు, సూరజ్, గంగాధర్, శేషు, మనోహర్, వీరేష్ పాల్గొన్నారు.


క్రీడాకారులతో నిర్వాహకులు


మెగా డీఎస్సీ విజేతలను అభినందిస్తున్న ఆదెన్న

## 'కూటమి'లోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు : టిడిపి

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలనలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మెగా డీఎస్సీ విజేతలు తగరం భాగ్యమ్మ, మద్రి నగేష్, సుమాల కుమార్, మద్రి లోక్ నాథ్, తేజను శాలువా, పూలమాలలతో సన్మానించి, అభినంద న కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీ టిడిపి సీనియర్ నాయకులు, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ రోజా ఆర్ట్స్ ఉసేని, జగతాప్ జైపాల్ పాల్గొన్నారు.

## మోతాదుకు మించి యూరియా వాడొద్దు : తహశీల్దార్

**ప్రజాశక్తి - మంత్రాలయం**

రైతులు మోతాదుకు మించి యూరియా వాడొద్దని తహశీల్దార్ కె.రమాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని సూగూరు, చెట్నిహళ్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు ఎరువుల బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడారు. రైతులు అవగాహన లేకుండా యూరియా వాడడం వల్ల డబ్బు వృథా కావడంతో పాటు భూమి, పంటలు కలుషితమై నష్టం వాటిల్లుతుం దని హెచ్చరించారు. యూరియా దొరకదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సూగూరు, చెట్నిహళ్లి, మాలపల్లి, 52 బసాపురం, కల్లుదేవకుంట, వగరూరు గ్రామాల్లోని ఆర్ఎస్‌కెలలో అందుబాటులో ఉందని తెలిపారు. ఎఒ జీరా గణేష్, ఎఇఒ తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక హామీ ఏమైంది

**- కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్ ధోకా**


**ప్రజాశక్తి - ఆదోని**

ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం మరచిందని కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్ ధోకా, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక సరఫరాలో గత వైసిపి ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం మరీ దారుణంగా వ్యవహరిస్తోందని తెలి పారు. ఇసుక దందా తారాస్థాయికి చేరిందని ధ్వజమెత్తా రు. ఆదోనిలో 5 టన్నుల ఇసుక టిప్పర్ రూ.25 వేలకు మించే అమ్ముతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి స్పందించలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ యువజన నాయకులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు శ్రీనిత్ పాల్గొన్నారు.

## 'ఎంపిపిపై అవిశ్వాసానికి సిద్ధం'

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని మండల పరిషత్ అధ్యక్షులులు దానమ్మపై అవిశ్వాసం పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని వైసిపి నాయకులు చంద్రకాంతరెడ్డి, గురునాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజను కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బుధవారంతో నాలుగేళ్ల పదవి కాలం పూర్తవుతుందని, అప్పుడే అవిశ్వాసం పెట్టేందుకు అవకాశముంటుందని సబ్ కలెక్టర్ సూచించారని తెలిపారు. 19 మంది ఎంపిటిసిలు తమకు ఉన్నారని, అవిశ్వాసంలో తాము నెగ్గి దానమ్మను కుర్చీ నుంచి దింపుతామని చెప్పారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

## పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

**- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ**

**ప్రజాశక్తి - ఆదోని**

పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల, హైస్కూల్ పరిసరాల్లో గుడిసె ఆది కృష్ణమ్మ సేవా సైన్యం ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్'లో భాగంగా కృష్ణమ్మ, ఇస్వి ఎస్ఐ డాక్టర్ నాయక్‌లు పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి శ్రమదానం చేశారు. బ్లీచింగ్‌తో పరిసరాలను పరిశుభ్రం చేసి తొలగించిన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా డంప్ యార్డుకు తరలించారు. టిడిపి సీనియర్ నాయకులు శ్రీరాములు, మురళీ, మాజీ సర్పంచి కపటి మాధవ్, ఓంకార్, అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ, వడ్డేమాన్ గోపాల్, సాధిక్ వలీ, కల్లుబావి మల్లి, పెసరబండ శంకర్, గనేకల్ మల్లయ్య, వెంకట్, నారాయణ, లక్ష్మీనారాయణ, నాగరాజ్, భరత్, చిట్టి, విజయ్, కుప్పగల్లు హనుమంతు, ఆంజనేయులు, బల్లేకల్లు బసవరాజు, చంద్ర, రాజు, పెసరబండ వెంకటేష్, సవారయ్య, నాగనాథనహళ్లి రవి, మహాదేవ్, రామాంజనేయులు ఉన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న నాయకులు

---